క్లుప్తంగా

వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం


వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి ఆషాఢ పూర్ణిమ పర్వదినం సందర్భంగా గురువారం ప్రత్యంగిర హోమం నిర్వహించారు. పండితులు ఉదయం 9 గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. పూర్ణాహుతి నిర్వహించి అమ్మవార్లకు నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. అనంతరం అమ్మవారికి ప్రసాదాలు నివేదించి భక్తులకు పంపిణీ చేశారు. 60 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు. దేవస్థానానికి రూ.45 వేలు ఆదాయం సమకూరింది.

గురువులకు సత్కారం


గురువులను సత్కరిస్తున్న సత్యగాయత్రి బ్రాహ్మణ సంఘం సభ్యులు

అన్నవరం: గురు పౌర్ణిమ సందర్భంగా గురువారం స్థానిక సత్యగాయత్రి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ముగ్గురు గురువులను ఘనంగా సత్కరించారు. స్థానిక సుబ్రహ్మణ్యస్వామి ఆలయ ప్రాంగణంలో రుగ్వేద పండితులు గంగాధరబట్ల గంగబాబు, విశ్రాంత వ్రతపురోహితుడు ముత్య సత్యనారాయణ శర్మ, తెలుగు పండితులు ముళ్లమూడి సీతారామశాస్త్రి దంపతులను ఘనంగా సన్మానించారు. సంఘం ఉపాధ్యక్షుడు గాడేపల్లి సత్యనారాయణ, సంఘం వైదిక సలహాదారు, వ్రతపురోహిత సంఘం అధ్యక్షుడు ఛామర్తి కన్నబాబు, సంఘం కార్యదర్శి కామర్స్ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు. స్థానిక గొడేవారి తోటలో వేంచేసిన దత్తాత్రేయస్వామి ఆలయంలో శ్రీసత్య దత్త వైదిక సమాఖ్య ధార్మిక సేవా సంఘం ఆధ్వర్యంలో విశేషపూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు.

గురువే దైవం

అన్నవరం: గురువే దైవం, గురువే జ్ఞాన సుదీపం, గురువే తిమిరాంతకుడు, గురువే దార్శనికుడు అని తిరుమల తిరుపతి దేవస్థానాల (టీటీడీ) దాససాహిత్య ప్రాజెక్ట్ స్పెషల్ ఆఫీసర్ పగడాల ఆనంద తీర్థ ఆచార్యులు అన్నారు. గురుపూర్ణిమ పర్వదినం సందర్భంగా గురువారం రత్నగిరిపై టీటీడీ దాససాహిత్య ప్రాజెక్ట్ అన్నవరం దేవస్థానం సంయుక్తంగా నిర్వహించిన గురువందనం కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ వీర్ల సుబ్బారావు ఆధ్వర్యంలో ఆయనను సత్కరించి సత్యదేవుని ఫొటో, ప్రసాదం అందచేశారు.

పనులు డల్.. కష్టాలు ఫుల్

- నత్తనడకన సాగుతున్న తాండవ బ్రిడ్జి నిర్మాణం
- 50 గ్రామాల ప్రజలకు తప్పని అవస్థలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం


అసంపూర్తిగా నిలిచిన తాండవబ్రిడ్జి నిర్మాణ పనులు

కోటనందూరు: గ్రామంలో తాండవనదిపై నిర్మించ తలపెట్టిన బ్రిడ్జి నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఫలితంగా తుపానులు, వరదల సమయంలో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. తాండవనది పరివాహక ప్రాంతంలో భారీగా వర్షం కురిసినా, తాండవ జలాశయం నుంచి నది ద్వారా సముద్రానికి నీటిని విడిచిపెట్టినా కోటనందూరులో కాజ్‌వే (బ్రిడ్జి)పై నుంచి నీరు ప్రవహించి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ బ్రిడ్జి మీదుగా ప్రయాణించే 50 గ్రామాల ప్రజలకు ప్రయాణ కష్టాలు కొనసాగుతున్నాయి.

గత ప్రభుత్వంలో నిధుల మంజూరు

ఐదు దశాబ్దాల కలగా మారిన ఈ బ్రిడ్జి నిర్మాణానికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.10 కోట్ల నిధులు మంజూరు చేసింది. 50 శాతం పూర్తయిన నిర్మాణ పనులు సార్వత్రిక ఎన్నికల కోడ్‌తో నిలిచిపోయాయి. కొత్త ప్రభుత్వం కొలువుతీరిన తరువాత ఈ బ్రిడ్జి నిర్మాణ పనులను కొద్దిరోజుల క్రితం వరకూ పట్టించుకోలేదు. వేసవి ముగుస్తున్న తరుణంలో తిరిగి ప్రారంభమైన పనులు నత్తనడకన సాగుతున్నాయి. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభం కావడంతో నదిలో నీరు భారీగా ప్రవహించి నిర్మాణ పనులకు విఘాతం కలుగుతోంది. అంటే బ్రిడ్జి నిర్మాణం మరింత ఆలస్యమై ప్రజలకు మరి కొన్ని రోజులు అవస్థలు తప్పేలా లేవు.

వరదల సమయంలో..

తుని–నర్సీపట్నం రోడ్డు నుంచి కోటనందూరు గ్రామానికి చేరుకోవాలంటే మధ్యలో ఉన్న తాండవ నదిని దాటాల్సి ఉంది. ఐదు దశాబ్దాల క్రితం అప్పటి పరిస్థితులకు అనుగుణంగా కాజ్‌వే నిర్మించారు. ఈ కాజ్‌వే పైభాగం శిథిలం కావడం, ఇరు పక్కల రక్షణ లేకపోవడం, ఎత్తు, వెడల్పు, కింద ఫిల్లర్ల మధ్య దూరం తక్కువగా ఉండడం వంటి కారణాలతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. వరదల సమయంలో నదిలో నీరు కాజ్‌వే పైనుంచి ఉధృతంగా ప్రవహించి తుని–నర్సీపట్నం రోడ్డుకు, కోటనందూరు గ్రామానికి పూర్తిగా సంబంధాలు తెగిపోతున్నాయి. ఈ నేపథ్యంలో కాజ్‌వేను బ్రిడ్జిగా అభివృద్ధి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఈ ప్రాంత ప్రజలు డిమాండు చేస్తున్నారు.


వరదనీరు కాజ్‌వేపై ప్రవహిస్తున్నప్పుడు ప్రయాణికుల అవస్థలు (ఫైల్)

నిర్మాణం పూర్తయితే అభివృద్ధి

కోటనందూరులో తాండవ నదిపై బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే ప్రజల రాకపోకలతో పాటు ఈ ప్రాంతం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుంది. కోటనందూరులో తుని–నర్సీపట్నం రోడ్డు నుంచి పాతకొట్టాం, కేఈ చిన్నయ్యపాలెం, రౌతులపూడి, శంఖవరం మీదుగా కత్తిపూడి వద్ద 216 నంబరు హైవేకు చేరుకునేందుకు 33 కిలోమీటర్ల పొడవు గల రోడ్డు ఉంది. కోటనందూరులో తాండవ నదిపై సరైన బ్రిడ్జి లేక ఈ మార్గంలో భారీ వాహనాలు తిరిగే అవకాశం లేకుండా పోయింది. ఫలితంగా ఈ రోడ్డు లూప్‌లైన్‌గానే మిగిలిపోయింది. ఇక్కడ ఉన్న కాజ్‌వే బ్రిడ్జిగా అభివృద్ధి చెందితే సౌకర్యవంతమైన ప్రయాణంతో పాటు రోడ్లు, వ్యాపార అవకాశాలు, ఆర్థికంగా, సామాజికంగా పురోగతి సాధించి ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడే అవకాశం ఉంది.

బ్రిడ్జి నిర్మాణంతో ఎంతో మేలు



ఇప్పుడున్న కాజ్‌వేపై రాకపోకలకు ఎన్నో అవస్థలు పడుతున్నాం. తుపాను, వరదలు సంభవిస్తే నదిలో నీరు బ్రిడ్జి పైనుంచి ప్రవహించి రాకపోకలు నిలిచిపోతున్నాయి. తాండవ నదిపై బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే ప్రజల ఇబ్బందులు తొలగుతాయి. వరదలు, అత్యవసర సమయాల్లో కూడా ప్రయాణం సౌకర్యవంతంగా మారుతుంది. నిర్మాణ పనుల్లో వేగం పెంచి బ్రిడ్జిని త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలి.

– అయిల వీరబాబు, కోటనందూరు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తుని: విద్యుత్ లైన్ల నిర్వహణలో భాగంగా శుక్రవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ ప్రభాకరరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక సాయినగర్ ఇండోర్ సబ్‌స్టేషన్ పరిధిలోని జీఎన్‌టీ రోడ్డు ఫీడర్‌లో లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు చేపడుతున్నామన్నారు. పట్టణంలోని ఎల్ఐసీ సెంటర్, ఆర్ఎస్ పేట, జీఎన్‌టీ రోడ్డు, గొల్ల అప్పారావు సెంటర్, పోస్టాఫీసు, చేపల మార్కెట్, నక్కిన వీధి, తలుపులమ్మ గుడి ఏరియా, మేదరిపేట, తారక రామానగర్, మెయిన్ రోడ్డు, గరువువీధి, ఫీడర్ రోడ్డు, తహసీల్దార్ కార్యాలయం తదితర ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుని సహకరించాలని ఆయన కోరారు.

గోకవరం మండలంలో...

గోకవరం: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఏఈ వైవీఎస్ సుబ్రహ్మణ్యం తెలిపారు. మండలంలో 33 కేవీ బావోజీపేట–గోకవరం ఫీడర్ మరమ్మతుల నిమిత్తం తంటికొండ, గాదెలపాలెం, గోపాలపురం, ఇటికాయలపల్లి, వెంకటనగరం, కొత్తపల్లి, రాజుపాలెం, కామరాజుపేట, సూదికొండ, గంగంపాలెం, ఠాకూరుపాలెం, జగన్నాథపురం, మల్లవరం, భూపతిపాలెంతో పాటు దేవీపట్నం మండలంలోని ఇందుకూరుపేట, ఎస్.రామన్నపాలెం, రావిలంక, పోతారం, దేవారం, ఫజుల్లాబాద్, తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కూటమి పాలనలో అరాచకాలు


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు


బుధవారం అర్ధరాత్రి ఆలయ శ్లాబ్‌ను తొలగించిన దృశ్యం

- అర్ధరాత్రి మందిర నిర్మాణ శ్లాబ్ తొలగింపు
- మండిపడిన వైఎస్సార్ సీపీ నాయకులు

జగ్గంపేట: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గ్రామాల్లో అరాచకాలు పెరిగిపోతున్నాయని, కూటమి నేతల దృష్టి ఆలయాలపై పడిందని వైఎస్సార్ సీపీ నాయకులు, జగ్గంపేట ఉప సర్పంచ్ బండారు రాజా ఆరోపించారు. జగ్గంపేటలో గురువారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. స్థానిక గోకవరం రోడ్డును ఆనుకుని నెహ్రూ కాలనీకి సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న సాయిబాబా శ్లాబ్‌ను బుధవారం అర్ధరాత్రి స్థానిక నేతలు తొలగించేందుకు శ్రీకారం చుట్టారన్నారు. గురుపౌర్ణమి రోజే దేవుడికే రక్షణ కరువైతే ప్రజలకు రక్షణ ఏముంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. మందిరానికి ఆనుకుని ఉన్న స్థలాన్ని నీలాద్రిరావుపేటకు చెందిన వ్యక్తి అమ్మకునేందుకు శ్లాబ్ అడ్డుగా ఉందని తొలగించడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. మందిర నిర్మాణాన్ని ఆనుకుని ఉన్న స్థలంలో షాపులు నిర్మించుకునేందుకు శ్లాబ్‌ను బద్దలు కొట్టించారన్నారు. గతంలో ఉన్న మందిరాన్ని రోడ్డు విస్తీరణంలో తొలగించడంతో ఇక్కడ నూతన మందిరాన్ని నిర్మిస్తున్నామన్నారు. కాగా నిర్మాణం పూర్తి కాకుండానే స్థానిక నేతలు అరాచకాలకు పాల్పడటం హిందూ ధర్మాన్ని అవమానించినట్టే అన్నారు. ఆలయం పనులు అడ్డుకునే ప్రయత్నం చేస్తే భక్తులతో కలసి ఆమరణ నిరాహారదీక్ష చేస్తామని హెచ్చరించారు.

ఘనంగా బీవీపీ ఆవిర్భావ వేడుకలు

తుని: భారత్ వికాస పరిషత్ (బీవీపీ) ఆవిర్భావ దినోత్సవాన్ని తునిలో గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బాలికోన్నత పాఠశాలలో బీవీపీ వ్యవస్థాపకులు డాక్టర్ సూరజ్ ప్రకాష్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయంతిని బీవీపీ అధ్యక్షుడు జి.వేణుగోపాలస్వామి సత్కరించారు. బీవీపీ ప్రతినిధులు నాగేశ్వరరావు, రాజబాబు, చదరం శివాజీ, కుందెం సత్యనారాయణ, ప్రసాద్, శివకుమార్, అమల రాజు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు

- సాయిబాబాకు ప్రత్యేక పూజలు
- గ్రామాల్లో అన్నసమారాధనలు


ఏలేశ్వరం గీతాశ్రమంలో ప్రత్యేక పూజలు చేస్తున్న మహిళలు


రౌతుపాలెంలో సాయిబాబాను దర్శించుకుంటున్న వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు

ఏలేశ్వరం: గురుపౌర్ణమి వేడుకలు నియోజకవర్గవ్యాప్తంగా గురువారం ఘనంగా జరిగాయి. సాయిబాబా మందిరాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు చోట్ల అన్నదానాలు చేశారు. పట్టణంలోని సాయి బాబామెట్ట, లింగవరం కాలనీ తదితర ప్రాంతాల్లోని బాబా మందిరాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. పట్టణంలోని వైఆర్‌పీ క్వార్టర్స్ వద్ద గత గీతాశ్రమంలో విశ్వ హిందూ పరిషత్ మాతృశక్తి, దుర్గావాహని మహిళా సంఘాల ఆధ్వర్యంలో విష్ణు, బాబా పారాయణాలు, భగవద్గీత పఠనం చేశారు. కార్యక్రమంలో గిరిజ, ఇందిర, మల్లేశ్వరి, శారద, మంగామణి తదితరులు పాల్గొన్నారు. మండలంలోని లింగంపర్తి, సిరిపురం, యర్రవరం తదితర గ్రామాల్లోని బాబా మందిరాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని రౌతుపాలెం, ప్రత్తిపాడు, రాచపల్లి, ధర్మవరం తదితర గ్రామాల్లోని ఆలయాల్లో గురు పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. రౌతుపాలెంలో సాయిబాబాను వైఎస్సార్ సీపీ నియోజవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు, సీబీఎన్ ఆర్మీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ యాళ్ల జగదీష్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. రాచపల్లి అరుణాచల క్షేత్రంలో శ్రీరమణా సేవాశ్రమం వ్యవస్థాపకులు, ఆధ్యాత్మిక గురువు స్వామి రామానందను ఆలయ ప్రాంగణంలో ఆలయ కమిటీ సభ్యులు, రాచపల్లిలో బీజేపీ నియోజకవర్గం కన్వీనర్ శింగిలిదేవి సత్తిరాజు, బీజేపీ జిల్లా నాయకులు పైలా సుభాష్ చంద్రబోస్, కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి దేవర రామకృష్ణ యాదవ్, ఏలేశ్వరం పట్టణ బీజేపీ అధ్యక్షులు పైలా అయ్యప్ప, ఏలేశ్వరం రూరల్ మండల బీజేపీ అధ్యక్షులు నీలి సురేష్ తదితరులు ఘనంగా సన్మానించి ఆయన ఆశీస్సులు తీసుకున్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు గొల్లపల్లి కాశీవిశ్వనాథ్, రామిశెట్టి నాని, జల్లిగంపల ప్రభాకరరావు, గొల్లపల్లి దొరబాబు, నేదుళ్ల శ్రీను, శిగిరెడ్డి శ్రీను, గణేషుల రామ్‌గోపాల్, దేవర రమేష్, లొండ బాబు, గుణ్ణం వెంకటరమణ, చక్కపల్లి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

గండేపల్లి: ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని తాళ్లూరు దుర్గాదేవి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం కబంధ ప్రసాద వితరణ గావించారు. గ్రామంలోని సాధుస్త్రీల ఆశ్రమంలో లలితాదేవికి చండీహోమం నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సమారాధన జరిపారు.

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

తొండంగి: గురుపౌర్ణమి సందర్భంగా బెండపూడి సాయిబాబా మందిరంలో పంచహారతులు, పుష్పార్చన, పంచామృతాభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం గ్రామంలో ఊరేగింపు ఉత్సవం నిర్వహించారు. దానవాయిపేట, రావికంపాడు తదితర గ్రామాల్లోని సాయిబాబా మందిరాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ చేశారు.

సాయిబాబాను దర్శించుకున్న గిరిబాబు

కిర్లంపూడి: గురు పౌర్ణమిని పురస్కరించుకుని మండలంలోని సాయిబాబా ఆలయాల్లో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. జగపతినగరంలో వేంచేసిన షిర్డీ సాయిబాబాను వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట పెంటకోట నాగబాబు, చదలవాడ బాబీ తదితరులు ఉన్నారు.

శాకంబరిగా దర్శనమిచ్చిన అమ్మవార్లు


శాకంబరి అలంకరణలో మరిడమ్మతల్లి


శాకంబరిగా శ్రీవాసవి మాత


శాకంబరిగా దర్శనమిచ్చిన నేరేళ్లమ్మవారు


తునిలో శాకంబరి అలంకరణలో దర్శనమిచ్చిన వరమహాలక్ష్మి అమ్మవారు

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం గ్రామదేవతలు వనదుర్గ, కనకదుర్గ అమ్మవార్లు, శ్రీవాసవి మాత గురువారం ఆషాఢ పౌర్ణిమ సందర్భంగా శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. నిత్యం పట్టు వస్త్రాలు ధరించి ఆభరణాలతో భక్తులకు దర్శనమిచ్చే గ్రామదేవతలను కాయగూరలు, వివిధ రకాల పండ్లతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు, అమ్మవార్లను దర్శించి పూజలు చేశారు. స్థానిక వెలంపేటకు చెందిన మహిళలు ఊరేగింపుగా ఆలయాలకు వచ్చి అమ్మవార్లకు సారె, చీర సమర్పించారు.

గండేపల్లిలో..

గండేపల్లి: స్థానిక మహర్షి జ్యోతిషాలయం పీఠంలో గురుపౌర్ణమి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని శాకంబరిదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

శాకంబరిగా వరమహాలక్ష్మి అమ్మవారు

తుని: స్థానిక చిట్టూరి మెట్రోలో వేంచేసిన వరమహాలక్ష్మి అమ్మవారు శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. గురువారం పౌర్ణమి సందర్భంగా అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో అలంకరించి సహస్ర కుంకుమార్చన నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు లలితా సహస్ర పారాయణ, దశవిధ హారతులు జరిపించారు. తుని, పాయకరావుపేట పట్టణాలు, తుని మండలానికి చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా శ్రీప్రకాష్ విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్ ప్రత్యేక ఏర్పాట్లు చేసి పర్యవేక్షించారు.

కామరాజుపేటలో తొలి అడుగు

గోకవరం: మండలంలోని కామరాజుపేటలో గురువారం జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యుడు జ్యోతుల నెహ్రూ తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో అందించిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఆయన వెంట జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ అడపా భరత్‌బాబు, సర్పంచ్ అడపా వెంకట్రావు, నాయకులు గాజింగం సత్తిబాబు తదితరులు ఉన్నారు.

నూతన వసతి గృహం ప్రారంభం

జగ్గంపేట: స్థానిక సచివాలయం–2 వద్ద నూతనంగా నిర్మించిన సాంఘిక సంక్షేమశాఖ బాలికల నూతన వసతి గృహాన్ని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి సత్యనారాయణ, అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ వై.వాణి, ఎండీఓ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వీఐపీ దర్శనం పేరుతో డబ్బులు వసూలు చేస్తున్న వ్యక్తిపై కేసు

జగ్గంపేట: 'నేను ఎమ్మెల్యే, టీటీడీ మెంబర్ జ్యోతుల నెహ్రూ పీఏ, మీకు తిరుమలలో వీఐపీ దర్శనాలు ఇప్పిస్తాను' అంటూ పలువురు వ్యక్తులకు ఫోన్లు చేసి డబ్బులు వసూలు చేస్తున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. ఓ వ్యక్తి వంశీ పేరుతో పలు నంబర్లు నుంచి ఫోన్లు చేసి ఎమ్మెల్యే కార్యాలయం నుంచి మాట్లాడుతున్నానని, తిరుమలలో వీఐపీ బ్రేక్, సేవా దర్శనం టిక్కెట్లు ఇప్పిస్తానని, ఇందుకు రూ.50 వేలు ఖర్చవుతుందని డబ్బులు వసూలు చేస్తున్నాడు. దీనిపై ఎమ్మెల్యే పీఏగా ప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న సీఐ తెలిపారు.

విద్యా ప్రమాణాలు పెంచాలి

- డీఈఓ రమేష్
- ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాలు


కామరాజుపేట సమావేశంలో మాట్లాడుతున్న తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహకిశోర్


వి.కొత్తూరులో తల్లిదండ్రులకు పాదాభివందనం చేస్తున్న విద్యార్థులు


ఒమ్మంగిలో విద్యార్థులతో డీఈఓ రమేష్, ఎంఈఓ రాజబాబు తదితరులు

ప్రత్తిపాడు రూరల్: విద్యా ప్రమాణాలు పెంపొందించేందుకు విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు సమిష్టిగా పని చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేష్ సూచించారు. మండలంలోని లంపకలోవ, ఒమ్మంగి గ్రామాల్లో గురువారం నిర్వహించిన మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధను తీసుకోవాలన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు మెరుగైన వసతులు, సౌకర్యాలను కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ సూర్యప్రభ, ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు, ఎంఈఓ వి.రాజబాబు, ఎంఈఓ–2 అచ్చిరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులను గౌరవించాలి

తుని: విద్యార్థులు తల్లిదండ్రులను గౌరవించాలని డిప్యూటీ కలెక్టర్ ఎస్.శ్రీధర్ అన్నారు. గురువారం తుని పట్టణం, మండల పరిధిలోని పాఠశాలల్లో పీటీఎం వేడుకులను ఘనంగా నిర్వహించారు. వి.కొత్తూరు గురుకుల పాఠశాలలో నిర్వహించిన వేడుకులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు తల్లులకు పాదాభివందనం చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ విద్యార్థులకు క్రమ శిక్షణతో పాటు మంచి నడవడిక నేర్పించడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. తుని రూరల్ సీఐ చెన్నకేశవరావు విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ప్రిన్సిపాల్ నిర్మలా కుమారి, సాంఘిక సంక్షేమశాఖ అధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. తుని పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, రాజా ఉన్నత పాఠశాల, మున్సిపల్ పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులకు పలు పోటీలు నిర్వహించారు. విజేతలకు మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్ బాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ నార్ల భువనసుందరి ప్రోత్సాహక బహుమతులను అందజేశారు.

ఏలేశ్వరం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో హెచ్ఎంల ఆధ్వర్యంలో గురువారం మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాలు ఏర్పాటు చేశారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు తల్లిదండ్రులకు పాద పూజలు చేశారు. తల్లిదండ్రులకు పాఠశాలలో అందిస్తున్న విద్య, వసతులను వివరించారు. అనంతరం పాఠశాలల్లో విందు భోజనాలు ఏర్పాటు చేశారు.

రౌతులపూడి: మండలంలోని శృంగవరం ప్రాథమిక పాఠశాల, రౌతులపూడి జెడ్పీ హైస్కూల్లో జరిగిన పీటీఎం సమావేశాలకు జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థుల తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా పలువురు విద్యార్థులకు గ్రీన్ పాస్‌పోర్టు సర్టిఫికెట్లు అందజేశారు. జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం, ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి, ఆయా గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంఈఓలు ఎ.శ్రీనివాస్, గాడి కొండబాబు పాల్గొన్నారు.

గండేపల్లి: మండలంలోని తాళ్లూరు జెడ్పీ హైస్కూల్లో హెచ్ఎం కేవీవీ సత్యనారాయణ అధ్యక్షతన మెగా పీటీఎం నిర్వహించారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి ట్రిపుల్ ఐటీకి ఎంపికైన మన్యం లక్ష్మణ్, షైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపికైన దూళ్ల హెప్సీబా, ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైన తిప్పాని కీర్తి ప్రియలను అభినందించారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

కిర్లంపూడి: కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్య అందిస్తున్నట్టు టీటీడీ బోర్డు మెంబర్, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. స్థానిక కొక్కొండ రామశేషగిరిరావు పంతులు ప్రభుత్వోన్నత పాఠశాలలో ఎంఈఓలు టి.జోసెఫ్, ఎం.చిన్నారావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశాన్ని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ప్రారంభించారు. జనసేన జగ్గంపేట కో ఆర్డినేటర్ తుమ్మలపల్లి రమేష్, ఎంపీపీ తోట రవి, సొసైటీ చైర్మన్‌లు తోట గాంధీ, కుర్ల చినబాబు పాల్గొన్నారు.

శంఖవరం: మండలవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ నిర్వహించారు. విద్యార్థుల ప్రగతిని తల్లిదండ్రులకు వివరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ గోవింద్ మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకోవాలి

గోకవరం: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి.నరసింహకిశోర్ సూచించారు. మండలంలోని కామరాజుపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గురువారం జరిగిన మెగా పేరెంట్స్ డే మీటింగ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో విద్యాసంస్థలు మనకు దూరంగా వెళ్లిపోయాయని, విద్యా సంస్థల గేట్ల వరకే తల్లిదండ్రులు పరిమితం అయ్యారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో తల్లిదండ్రులకు భాగస్వామ్యం కల్పించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో నార్త్‌జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్, కోరుకొండ సీఐ సత్యకిశోర్, గోకవరం ఎస్సై పవన్‌కుమార్, జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ అడపా భరత్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తొండంగి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం టీచర్స్, పేరెంట్స్ మీట్ నిర్వహించారు. పెరుమాళ్లపురం జెడ్పీ హైస్కూల్లో హెచ్ఎం చాట్రాతి సత్యనారాయణ ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఎస్ఎంసీ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థుల ప్రగతి, పాఠశాల అభివృద్ధి తదితర అంశాలపై చర్చించారు. అనంతరం వివిధ రకాల క్రీడలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్, సభ్యులు పాల్గొన్నారు.